క్లుప్తంగా

జలపాలేశ్వరుడికి విశేష పూజలు



ఫిరంగిపురం: మండలంలోని వేములూరిపాడు గ్రామంలోని జలపాలేశ్వరస్వామి ఆలయంలో కార్తీక మాసాన్ని పురస్కరించుకొని సోమవారం సాయంత్రం విశేష పూజలు నిర్వహించారు. స్వామికి అర్చకులు ఉమాపతిశాస్త్రి పంచామృతాలతో అభిషేకాలు చేసి విశేష అలంకారం చేశారు. భక్తుల గోత్రాలతో పూజలు చేసి తీర్థప్రసాదాలు అందజేశారు. భక్తులు కార్తీక దీపాలు వెలిగించారు.

నేడు వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం

తాడికొండ: తాడికొండ మండలం కంతేరు, ఫిరంగిపురం మండలం ఫిరంగిపురం–3 సచివాలయం, మేడికొండూరు మండలం సిరిపురం గ్రామ సచివాలయం–1 పరిధిలో మంగళవారం వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహించనున్నట్లు వైఎస్సార్ సీపీ తాడికొండ నియోజకవర్గ సమన్వయకర్త కత్తెర సురేష్‌కుమార్ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కార్యక్రమంలో భాగంగా జెండా ఆవిష్కరణ అనంతరం సాయంత్రం 5 నుంచి 9 గంటల వరకు, మరుసటి రోజు ఉదయం 8 గంటల నుంచి ఇంటింటి ప్రచారం నిర్వహిస్తామని, వైఎస్సార్ సీపీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు పాల్గొని కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు.

ఫాతిమా మాత ప్రతిమ ప్రతిష్ఠ



తాడేపల్లిరూరల్: నగర పాలక సంస్థ పరిధిలోని పునీత అన్నమ్మ దేవాలయ ప్రాంగణంలో ఆదివారం ఫాతిమా మాత ప్రతిమ ప్రతిష్ఠ మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ ప్రతిష్ఠ మహోత్సవానికి గుంటూరు జిల్లా పీఠాధిపతి చిన్నాబత్తిన భాగ్యయ్య విచ్చేశారు. ముందుగా తల్లి ఫాతిమా మాత ప్రతిమను ప్రకాష్‌నగర్ నుంచి ఊరేగింపుగా తీసుకొని వచ్చారు. అనంతరం ప్రత్యేక నిర్మాణంలో ప్రతిష్ఠించారు. కార్యక్రమంలో విచారణ గురువులు ఫాదర్ మరియదాసయ్య, పాపయ్య, ఫాదర్ కె. జ్యోతిరాజు, రాజు, డాన్‌బాస్కో ఫాదర్స్, సిస్టర్స్, తాడేపల్లి వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షులు బుర్రముక్కు వేణుగోపాలస్వామి రెడ్డి, జేసీఎస్ కన్వీనర్ ఈదులమూడి డేవిడ్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచారం



తాడేపల్లిరూరల్: త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి, ఇందూ జ్ఞాన వేదిక ఆధ్వర్యంలో తాడేపల్లి రూరల్ పరిధిలోని వడ్డేశ్వరం, కొలనుకొండ గ్రామాల్లో సోమవారం ప్రచారం నిర్వహించారు. త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి, ఇందూ జ్ఞాన వేదిక విజయవాడ, గుంటూరు కమిటీల అధ్యక్షులు జగిరపు సురేష్ మాట్లాడుతూ గురువు తన జ్ఞానాగ్నితో శిష్యుల తలలో ఉన్న జ్ఞాన జ్యోతి వెలిగించి యోగ మార్గంలో నడిపిస్తాడు అనడానికి గుర్తుగా దీపావళి రోజున ఇంట్లో దీపాలు వెలిగించాలని, శరీరం బయట అంతటా విశ్వాన్ని నడిపే పరమాత్మ శక్తి ఉందనేందుకు గుర్తింపుగా ఇంటి బయట కూడా దీపాలు వెలిగించాలని అన్నారు. అనంతరం ఆధ్యాత్మిక పుస్తకాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో సభ్యులు రౌతు శ్రీనివాసరావు, శంకర్, దుర్గారావు, శ్రీను, జయ, గౌరి, సూరప్పడు, సత్యం, లక్ష్మి, పైడప్పడు, ప్రవీణ, కృష్ణారావు, రామకృష్ణ, తిరుపతిరావు, సుబ్బారావు, హేమాద్రి, విద్య తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో నలుగురికి గాయాలు



మేడికొండూరు: మండల పరిధిలో సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో నలుగురికి గాయాలయ్యాయి. మేడికొండూరు ఎస్సై మధుపవన్ తెలిపిన వివరాలు.. గుంటూరు నెహ్రూనగర్ పదో లైనుకు చెందిన కోలా నారాయణ తన కుటుంబ సభ్యులు మూర్తి, లక్ష్మి, గోవిందమ్మలతో కలసి సత్తెనపల్లిలో జరిగిన ఓ కార్యక్రమానికి హాజరయ్యారు. తిరుగు ప్రయాణంలో గుంటూరు వైపు వెళుతున్న సమయంలో మార్గం మధ్యలో మేడికొండూరు మండలం గుండ్లపాలెం గ్రామ సమీపంలో ఎదురు వస్తున్న కారు డ్రైవర్ అజాగ్రత్తతో కారు నడుపుతూ ఆటోను ఢీకొన్నాడు. ప్రమాదంలో ఆటోలో ప్రయాణిస్తున్న వారు కింద పడ్డారు. ఆటో డ్రైవర్ నారాయణకు తీవ్రగాయాలయ్యాయి. మిగిలిన వారికి స్వల్ప గాయాలయ్యాయి. క్షతగాత్రులను 108 సహాయంతో గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై మధుపవన్ తెలిపారు.

నేటి నుంచి గ్రంథాలయ వారోత్సవాలు



మంగళగిరిలోని పౌర గ్రంథాలయం

మంగళగిరి: నగరంలోని రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ కార్యాలయంలో మంగళవారం నుంచి 56వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు నిర్వహించనున్నట్లు గ్రంథాలయ పరిషత్ చైర్మన్ మందపాటి శేషగిరిరావు సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గ్రంథాలయ వారోత్సవాలలో భాగంగా వారం రోజులపాటు వివిధ కార్యక్రమాలు నిర్వహించి విద్యార్థులు వ్యాసరచన, వక్తృత్వ, క్విజ్ వివిధ రకాల పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. గ్రంథాలయ ఉద్యమంలో పాల్గొన్న ప్రముఖులను స్మరించుకోవడం, కవి సమ్మేళనాలు, సెమినార్లు, మహిళలకు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించి విజేతలకు ఈనెల 20వ తేదీన బహుమతులు ప్రదానం చేయనున్నట్లు తెలిపారు.

నూతక్కిలో...

నగర పరిధిలోని నూతక్కి గ్రంథాలయంలో బుధవారం నుంచి ఈనెల 20వ తేదీ వరకు 56వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు నిర్వహించనున్నట్లు లైబ్రేరియన్ ఎస్ నరసింహారావు సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. మంగళవారం వారోత్సవాలు ప్రారంభం, 15న పుస్తక ప్రదర్శన, 16న గ్రంథాలయ ఉద్యమంలో పాల్గొన్న ప్రముఖులను స్మరించుట, 17న కవి సమ్మేళనాలు, 18న విద్యార్థిని, విద్యార్థులకు వ్యాసరచన, డ్రాయింగ్, క్విజ్, వక్తృత్వ పోటీలు, 19న మహిళా దినోత్సవం, 20న బహుమతుల ప్రదానంతో వారోత్సవాలు ముగుస్తాయని తెలిపారు.

తాడేపల్లిరూరల్: తాడేపల్లి శాఖా గ్రంథాలయంలో మంగళవారం నుంచి ఈనెల 22వ తేదీ వరకు 56వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు నిర్వహించనున్నట్లు గ్రంథాలయ అధికారి షేక్ నాగుర్ బాషా సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మాజీ ప్రధాని జవహర్ లాల్ నెహ్రూ జయంతి సందర్భంగా ఈ వారోత్సవాలు ప్రారంభమవుతాయని, అదేరోజు సీనియర్స్ విభాగంలో వక్తృత్వ, వ్యాసరచన, చిత్రలేఖన పోటీలు, 15న పుస్తక ప్రదర్శన, సబ్ జూనియర్స్ విభాగంలో చిత్రలేఖన పోటీలు, 16న గ్రంథాలయంలో ప్రముఖ పాత్రపై చర్చ, సబ్ జూనియర్స్ విభాగంలో దేశభక్తి గీతాల పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. 17న కవి సమ్మేళనం, సెమినార్, సబ్ జూనియర్స్, జూనియర్స్, సీనియర్స్ విభాగంలో పద్యాల పోటీలు, 18న జూనియర్స్ విభాగంలో వ్యాసరచన, వక్తృత్వ పోటీలు, 19న దిశా చట్టం, మహిళా సాధికారత అంశాలపై చర్చలు, మహిళలకు ముగ్గుల పోటీలు, 20న డిజిటల్ లైబ్రరి, చదువు అంటే మాకు ఇష్టంపై అవగాహన సదస్సు నిర్వహిస్తామని, అదేరోజు ముగింపు వేడుకలు నిర్వహించి విజేతలకు బహుమతి ప్రదానం జరుగుతుందని తెలిపారు.

ఫిరంగిపురం: స్థానిక గాలిబాలి శాఖ గ్రంథాలయంలో మంగళవారం నుంచి 56వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు నిర్వహించనున్నట్లు గ్రంథాలయ ఇన్‌చార్జి పి.జేమ్స్‌బాబు సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. గ్రంథాలయంలో ఉదయం పదిగంటలకు పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తారు. అనంతరం పుస్తకప్రదర్శన, విద్యార్థులకు చిత్రలేఖన పోటీలు నిర్వహిస్తామని చెప్పారు. 15న వ్యాసరచన, 16న మ్యూజికల్ చైర్స్, 17న పాటలపోటీ, 18న రంగోళి, 19న మెహింది, 20 గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేస్తామన్నారు.

తాడికొండ: జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు మంగళవారం నుంచి నిర్వహించనున్నట్లు తాడికొండ శాఖ గ్రంథాలయాధికారి జి శ్రీనివాసరావు, తుళ్లూరు శాఖ గ్రంథాలయాధికారి గిరిధర్‌కుమార్‌లు సోమవారం వేర్వేరు ప్రకటనల్లో పేర్కొన్నారు. 15న పుస్తక ప్రదర్శన, 16న గ్రంథాలయోద్యమంలో పాల్గొన్న ప్రముఖులను స్మరించుట, 17న కవి సమ్మేళనం, 18న పాఠశాల విద్యార్థులకు ఆటల పోటీలు, 19, మహిళా దినోత్సవం, 20న ముగింపు వేడుకలు, బహుమతి ప్రదానం నిర్వహించనున్నట్లు వారు తెలిపారు. పాఠకులు, విద్యార్థులు పాల్గొని ఈ వేడుకలను జయప్రదం చేయాలని కోరారు.

మేడికొండూరు: గ్రంథాలయ వారోత్సవాలు మంగళవారం నుంచి నిర్వహిస్తున్నట్లు మండల గ్రంథాలయ అధికారిణి సుధారాణి తెలిపారు. సోమవారం విలేకరుల సమావేశంలో సుధారాణి మాట్లాడుతూ వారోత్సవాలు ఈనెల 20వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వారోత్సవాల్లో భాగంగా 14న బాలల దినోత్సవం, 15న ప్రముఖ ఉపన్యాసాలు, 16న పుస్తక ప్రదర్శన, 17 వ్యాసరచన పోటీలు, 18న క్రీడా పోటీలు, 19న మహిళ సాధికారిత దిశ చట్టంపై అవగాహన కార్యక్రమం, 20న డిజిటల్ గ్రంథాలయాలపై సెమినార్ నిర్వహించడం జరుగుతోందన్నారు.

తప్పిపోయిన బాలుడిని తండ్రికి అప్పగించిన పోలీసులు

మంగళగిరి: ఇంటి నుంచి ఆడుకుంటూ వచ్చి తప్పిపోయిన బాలుడి ఆచూకీ తెలుసుకుని తిరిగి తండ్రికి అప్పగించారు పట్టణ పోలీసులు. పట్టణ పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. నగరంలోని గండాలయపేటకు చెందిన నాలుగేళ్ల బాలుడు రోహిత్ ఆదివారం సాయంత్రం ఇంటి నుంచి తప్పిపోయి నగరంలోని కొత్తపేట హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు వద్ద రోడ్డుపై చేరుకున్నాడు. గమనించిన స్థానికులు బాలుడిని పట్టణ పోలీసులకు అప్పగించారు. బాలుడి రోహిత్ ఆచూకీ తెలుసుకున్న పట్టణ పోలీసులు అదే రోజు రాత్రి తండ్రికి అప్పగించారు. తమ కుమారుడిని క్షేమంగా అప్పగించినందుకు బాలుడి కుటుంబ సభ్యులు పట్టణ పోలీసులకు కృతజ్ఞతలు తెలిపారు.



తండ్రితో బాలుడు రోహిత్

ప్రజా రక్షణ భేరిని విజయవంతం చేయండి

ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డి.రమాదేవి



మాట్లాడుతున్న ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డి.రమాదేవి

తాడేపల్లిరూరల్: విజయవాడలో బుధవారం జరగనున్న ప్రజా రక్షణ భేరిని విజయవంతం చేయాలని ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డి.రమాదేవి పిలుపునిచ్చారు. తాడేపల్లి రూరల్ పరిధిలోని కుంచనపల్లిలో సోమవారం ప్రచార కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. రమాదేవి మాట్లాడుతూ కేంద్రంలో నరేంద్రమోడీ నాయకత్వాన అధికారంలోకి వచ్చిన బీజేపీ ప్రభుత్వం పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలు ఇష్టమొచ్చినట్లు పెంచడం వలన నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశాన్నంటుతున్నాయని అన్నారు. సామాన్య ప్రజానీకంపై ధరల భారం మోపడం సరికాదన్నారు. మహిళలపైన దాడులు, లైంగికదాడులు ఎక్కువయ్యాయని అన్నారు. ప్రచార యాత్ర మెల్లంపూడి, వడ్డేశ్వరం, కొలనుకొండ గ్రామాల్లో నిర్వహించారు. కార్యక్రమంలో ఏపీ వృత్తి కళాకారుల సంఘం రాష్ట్ర నాయకులు ఎ.జగన్, సీపీఎం సీనియర్ నాయకులు జొన్నా శివశంకరరావు, తాడేపల్లి మండల కార్యదర్శి దొంతిరెడ్డి వెంకటరెడ్డి, నాయకులు కాట్రగడ్డ శివరామకృష్ణయ్య, పల్లె కృష్ణ, బత్తుల వెంకటేశ్వరరావు, కుంచనపల్లి గ్రామ మాజీ సర్పంచ్ అమ్మిశెట్టి సాంబయ్య, ఐద్వా రాష్ట్ర నాయకురాలు దొంతిరెడ్డి శ్రీనివాసకుమారి, మండల కార్యదర్శి కొండపల్లి యశోద, సీపీఎం కుంచనపల్లి గ్రామ శాఖ కార్యదర్శులు అమ్మిశెట్టి రంగారావు, కాజా వెంకటేశ్వరరావు, తాడేపల్లి పట్టణ నాయకులు కొట్టే కరుణాకరరావు, బి.దశరథ రెడ్డి, కంపా వెంకటయ్య, సీపీఎం ప్రాతూరు గ్రామ శాఖ కార్యదర్శి డోకిపర్తి రాజేంద్రబాబు, చిర్రావూరు గ్రామ శాఖ కార్యదర్శి మేడూరి పాములు, బొడ్డు ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

తాడేపల్లిరూరల్: సీపీఎం ఆధ్వర్యాన విజయవాడలో బుధవారం నిర్వహించనున్న ప్రజారక్షణ భేరి కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఆ పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఈమని అప్పారావు కోరారు. దుగ్గిరాల మండలం ఈమని, చుక్కవల్లివారిపాలెం, పెరికలపూడి, చిన్నపాలెం, పెద్దపాలెం, శృంగారపురం తదితర గ్రామాల్లో ప్రచార యాత్రను నిర్వహించారు. కార్యక్రమంలో పార్టీ దుగ్గిరాల మండల నాయకులు వై. స్టాలిన్, వై.బ్రహ్మేశ్వరరావు, బి.అమ్మిరెడ్డి, ఎస్.యోగేశ్వరరావు, యేసుపాదం తదితరులు పాల్గొన్నారు.

కరపత్రాలు పంపిణీ

విజయవాడలో బుధవారం జరిగే ప్రజారక్షణ భేరి బహిరంగసభను జయప్రదం చేయాలని కోరుతూ సీపీఎం ఆధ్వర్యంలో కరపత్రాల పంపిణీ కార్యక్రమం సోమవారం నిర్వహించారు. కార్యక్రమానికి దుగ్గిరాల మండల కార్యదర్శి జెట్టి బాలరాజు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. కార్యక్రమంలో పార్టీ మండల నాయకులు నాగమల్లేశ్వరరావు, బి.చిరంజీవి, ఎం.నరసింహారావు, ఎస్‌కె బాబూలాల్, అబ్దుల్లా, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన ఇస్లాం ధార్మిక శిక్షణ తరగతులు



విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేస్తున్న రాష్ట్ర జమీయ్యత్ అహ్లె హదీస్ అమీర్ షేఖ్ ఫజులుర్రహ్మాన్

మంగళగిరి: జమీయ్యత్ అహ్లె హదీస్ కృష్ణాజిల్లా, మస్జీద్–ఏ– అన్వరీ కమిటీ సంయుక్త ఆధ్వర్యంలో నగరంలోని నిడమర్రు రోడ్డు మస్జీద్– ఏ– అన్వరీ ఆవరణలో రెండు రోజులుగా జరుగుతున్న ఇస్లాం ధార్మిక శిక్షణా తరగతులు ఆదివారంతో ముగిశాయి. దావత్ మైదానంలో ఖురాన్–హదీస్ ల ప్రాముఖ్యత అనే అంశంపై షేఖ్ అబూ హయ్యాన్ హమ్మద్ ఉమరీ, ధర్మావగాహన కోసం అరబిక్ భాష ఆవశ్యకత అనే అంశంపై షేఖ్ అబ్దుల్ హఫీజ్ ఉమరీ, 73 పిర్ఖాలలో జన్నత్ (స్వర్గం)ను చేరుకునే వర్గం ఏది? అనే అంశంపై షేఖ్ అబ్దుల్ మాబూద్ జామయి, జిన్నాతులు– షైతానులు వాస్తవికత అనే అంశంపై జనాబ్ సయ్యద్ ఇల్యాస్ దాయిలు ప్రసంగించారు. కార్యక్రమానికి షేఖ్ అబూ హురైరా మదనీ, రాష్ట్ర జమీయ్యత్ అహ్లె హదీస్ అమీర్ షేఖ్ ఫజులుర్రహ్మాన్ ఉమరీ, కార్యదర్శి షేఖ్ అబ్దుల్ గఫ్ఫార్ ఉమరీ, కోశాధికారి జనాబ్ ఫారుఖ్ ఖాన్, జమీయ్యత్ అహ్లె హదీస్ గుంటూరు జిల్లా అమీర్ జనాబ్ అబ్దుర్రహ్మాన్ తదితరులు ముఖ్య అతిథులుగా హాజరై ధార్మిక విద్య ఆవశ్యకతపై ప్రసంగించారు. అనంతరం ఇటీవల మూడు నెలలపాటు నిర్వహించిన ఆన్‌లైన్ ఇస్లాం ధార్మిక శిక్షణా తరగతులకు హాజరైన విద్యార్థులకు వక్తలు సర్టిఫికెట్లను అందజేశారు.

చెడుపై మంచి సాధించే విజయమే దీపావళి

త్రిపుల్ ఎక్స్ కంపెనీలో ఘనంగా సంబరాలు



సిబ్బందితో కలిసి వేడుకలలో పాల్గొన్న అధినేత మాణిక్యవేలు, సతీమణి దివ్యభారతి

నిడుముక్కల(తాడికొండ): చెడుపై మంచి సాధించే విజయమే దీపావళి పండుగ అని, ఈ పండుగ నాడు అందరికీ శుభాలు కలగాలని ట్రిపుల్ ఎక్స్ సోప్ కంపెనీ అధినేత అరుణాచలం మాణిక్యవేలు అన్నారు. దీపావళి పండుగ పర్వదినాన్ని పురస్కరించుకొని ఆదివారం తాడికొండ మండలం నిడుముక్కల గ్రామంలోని సోప్ ఫ్యాక్టరీలో వేడుకలు ఘనంగా నిర్వహించారు. ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం ఆయన మాట్లాడుతూ సంస్కృతి, సాంప్రదాయాలు పాటిస్తూ భావితరాలకు పండుగల విశిష్టతను తెలియజేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. అందుకోసమే తమ కంపెనీలో భారతీయ విశిష్టతను చాటిచెప్పేలా అన్ని పండుగలను ఘనంగా నిర్వహించడం ఆనవాయితీగా వస్తుందన్నారు. ఫ్యాక్టరీలో పనిచేసే సిబ్బందికి మిఠాయిలు పంపిణీ చేసి అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో మాణిక్యవేలు సతీమణి దివ్యభారతి, కుమారుడు పర్విన్ బాబు పలువురు సిబ్బంది పాల్గొన్నారు.

అసాంఘిక చర్యలకు పాల్పడితే చర్యలు తప్పవు

పట్టణ సీఐ మల్లికార్జునరావు



రోడ్డుపై ఆకతాయిలు వదిలివెళ్లిన ద్విచక్ర వాహనాన్ని పరిశీలిస్తున్న పట్టణ సీఐ మల్లికార్జునరావు

మంగళగిరి: నగరంలో ఆకతాయిలు అసాంఘిక చర్యలకు పాల్పడితే చట్ట ప్రకారం కఠిన చర్యలు తప్పవని పట్టణ సీఐ మల్లికార్జునరావు హెచ్చరించారు. నగరంలోని కొప్పురావుకాలనీలో కొందరు ఆకయితాయిలు రాత్రి ఏడు గంటల నుంచి అర్ధరాత్రి ఒంటి గంట వరకు రోడ్డుపై మద్యం తాగుతూ, గంజాయి సేవిస్తూ స్థానిక మహిళలు, వృద్ధుల పట్ల అనుచితంగా ప్రవర్తించారని స్థానికులు సోమవారం పట్టణ సీఐ మల్లికార్జునరావును కలసి ఫిర్యాదు చేశారు. దీపావళి పండుగ సందర్భంగా టపాకాయలను ఉద్దేశపూర్వకంగా ఇళ్లల్లోకి, మహిళలపైకి విసిరారని, ఈ విషయమై ప్రశ్నించిన కొందరిపై భౌతిక దాడికి పాల్పడినట్లు ఆవేదన వ్యక్తం చేశారు. స్పందించిన సీఐ హుటాహుటీన సంఘటనా ప్రాంతానికి చేరుకుని స్థానికులను విచారించారు. కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

ఆనందోత్సాహాలతో దీపావళి

- భారీగా బాణసంచా మోతలు
- ఇంటింటా దీపాల వెలుగులు



టపాసులు కాల్చుతున్న చిన్నారులు

మంగళగిరి: దీపావళి పండుగను ప్రజలు ఆనందోత్సాహాలతో జరుపుకున్నారు. చిచ్చుబుడ్డుల వెలుగులు...టపాసుల మోతలతో పట్టణాలు, గ్రామాలు మార్మోగాయి. ఆదివారం ఉదయం నుంచే బాణసంచా విక్రయ దుకాణాలు కొనుగోలుదారులతో కిటకిటలాడాయి. గతంలో కంటే బాణసంచా ధరలు అధికంగా ఉండడంతో ప్రజలు తక్కువగా కొనుగోలు చేశారు. నగరంలోని భవనాలను, నివాసగృహాలను రంగు రంగుల దీపాలతో శోభాయమానంగా అలంకరించారు. సాయంత్రం గృహ ప్రాంగణం, తులసికోట, వాకిళ్లలలో రంగవల్లులతో అలంకరించి దీపాలు పెట్టారు. దీపలక్ష్మిని, ధనలక్ష్మిని, కుబేరుడిని భక్తిశ్రద్ధలతో పూజించారు. అనంతరం బాణసంచా కాల్చి మిఠాయిలు పంచుకుని పిల్లలు పెద్దలు కేరింతలు కొడుతూ పండుగను జరుపుకున్నారు.

విజయకీలాద్రిపై తిరునక్షత్ర మహోత్సవాలు

తాడేపల్లిరూరల్: తాడేపల్లి పట్టణ పరిధిలోని సీతానగరం విజయకీలాద్రి దివ్యక్షేత్రంపై తిరునక్షత్ర మహోత్సవాలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. జీయర్ ఎడ్యుకేషనల్ ట్రస్ట్ మేనేజర్ పురాణం వెంకటాచార్యులు మాట్లాడుతూ ఉదయం 4 గంటలకు త్రిదండి చిన్న జీయర్‌స్వామికి మంగళహారతి, ఆశ్రమ ప్రాంగణంలో నరకాసుర దహనం గావించామని, అనంతరం వేద విద్యార్థులకు వస్త్రాలను అందించామని తెలిపారు. చిన్నజీయర్‌స్వామి చేతుల మీదుగా తీర్థ ప్రసాద గోష్ఠి, భక్తులకు అన్నప్రసాదాలు అందజేశామని తెలిపారు. ఈ తిరునక్షత్ర మహోత్సవ కార్యక్రమంలో జీయర్ ఎడ్యుకేషనల్ ట్రస్ట్ చైర్మన్ గోకరాజు గంగరాజు లైలా దంపతులు, మైహోమ్స్ గ్రూప్స్ అధినేత రామేశ్వరరావు–కుమారి దంపతులు, మహా సిమెంట్ మేనేజింగ్ డైరెక్టర్ జూపల్లి రంజిత్‌రావు, ముక్కామల అప్పారావు, విజయ డెయిరీ చైర్మన్ చలసాని ఆంజనేయులు, క్రేన్ వక్కపలుకుల అధినేత గ్రంధి కాంతారావు, విజయవాడ పశ్చిమ నియోజకవర్గ శాసనసభ్యులు వెలంపల్లి శ్రీనివాసరావు, విజయవాడ నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి తదితరులు పాల్గొని స్వామి వారిని దర్శించుకుని ఆశీస్సులు పొందారని పురాణం వెంకటాచార్యులు అన్నారు.

ముగిసిన ఎన్‌ఎస్‌ఎస్ జోనల్ స్థాయి ఎంపికలు



ఎన్‌ఎస్‌ఎస్ రీజనల్ డైరెక్టర్ చెల్లయ్యను సత్కరిస్తున్న ఆంధ్రా, తెలంగాణ అధికారులు

తాడేపల్లిరూరల్: వడ్డేశ్వరంలోని కేఎల్ విశ్వవిద్యాలయంలో నిర్వహిస్తున్న ఎన్ఎస్ఎస్ జోనల్ స్థాయి ఎంపికలు సోమవారంతో ముగిశాయి. ఈ కార్యక్రమానికి సెలక్షన్ కమిటీ తరపున 2024 గణతంత్ర దినోత్సవ పరేడ్‌క్యాంప్ డైరెక్టర్ భువనేశ్వర్, ఎన్ఎస్ఎస్ రీజనల్ డైరెక్టర్ సరితా పటేల్, న్యూఢిల్లీ ఎన్ఎస్ఎస్ ప్రోగాం రీజనల్ డిప్యూటీ డైరెక్టర్ శామ్యూల్ చెల్లయ్యలు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. విశ్వవిద్యాలయ వైస్ చాన్సలర్ డాక్టర్ జి. పార్థసారథి వర్మ మాట్లాడుతూ ఎన్ఎస్ఎస్ వలంటీర్లను జోనల్‌స్థాయిలో ఎంపిక చేసి, వెస్ట్‌జోన్ తరుపున 40 మందిని 2024 జనవరి 26న ఢిల్లీలో జరిగే గణతంత్ర వేడులకు పంపడానికి సుమారు 10 రోజుల పాటు శిక్షణ ఇచ్చి, సాంస్కృతిక, పరేడ్ పరీక్షలు నిర్వహించామని, ఫలితాలు త్వరలో తెలుపుతామని అన్నారు. ఎంపికలకు ఆరు రాష్ట్రాల నుంచి సుమారు 200 మంది బాలికలు హాజరయ్యారని, ఆంధ్రప్రదేశ్ నుంచి 10 మంది, తెలంగాణ నుంచి ఆరుగురు, మహారాష్ట్ర నుంచి 14, మిగిలిన రాష్ట్రాల నుంచి మరో 10 మందిని ఎంపిక చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎన్ఎస్ఎస్ అధికారి డాక్టర్ పి.అశోక్‌రెడ్డి, యువశాఖ హైదరాబాద్ ప్రాంతీయ అధికారి సైదా నాయక్, సిబ్బంది ఎన్.సంజయ్, ప్రొ వైస్ చాన్సలర్లు డాక్టర్ ఏవీఎస్ ప్రసాద్, డాక్టర్ ఎన్.వెంకటరామ్, రిజిస్ట్రార్ డాక్టర్ కె.సుబ్బారావు, విద్యార్థి సంక్షేమ విభాగాధిపతి డాక్టర్ చప్పిడి హనుమంతరావు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి శ్రీకాంత్‌రెడ్డి, డాక్టర్ సుభాకర రాజు, చంద్రశేఖర్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ పాఠశాలలో గ్యాస్ సిలిండర్ చోరీ

మంగళగిరి: నగర పరిధిలోని పాత బ్యాంక్ కాలనీలో కల మున్సిపల్ పాఠశాలలో గ్యాస్ సిలిండర్ చోరీ జరిగిన ఘటన చోటుచేసుకుంది. శని, ఆదివారాలు సెలవు కావడంతో గుర్తు తెలియని దుండగులు గేటు పైనుంచి లోపలికి వెళ్లి పాఠశాల గది తాళం పగలకొట్టి గ్యాస్ సిలిండర్‌ను తీసుకెళ్లారు. తలుపు తెరచి ఉండడం గమనించిన స్థానికులు హెచ్‌ఎం కోటిరెడ్డికి సమాచారం అందించారు. సోమవారం పాఠశాలకు చేరుకున్న హెచ్‌ఎం గ్యాస్ సిలిండర్ లేకపోవడంతో పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాకు ఆటంకం

మంగళగిరి: నగర పాలక సంస్థ పరిధిలోని పెదవడ్లపూడి, కొత్తపాలెం ప్రాంతాల్లో మంగళవారం ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగనున్నట్లు విద్యుత్‌శాఖ డీఈఈ అక్కల సత్యనారాయణ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కేఎల్‌యూ రోడ్డు విస్తరణ పనుల నేపథ్యంలో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నామని, పెదవడ్లపూడి, కొత్తపాలెం ప్రజలు గమనించి విద్యుత్ శాఖకు సహకరించాలని కోరారు.

పేకాట స్థావరాలపై పోలీసుల దాడి

తాడికొండ: తాడికొండ మండలం నిడుముక్కల శివారులో పేకాట స్థావరాలపై సోమవారం పోలీసులు దాడులు నిర్వహించారు. ఐదుగురిని అదుపులోకి తీసుకున్నారు. వీరి వద్ద నుంచి రూ.2080 నగదును స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు సీఐ జి శ్రీనివాసరావు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి

కృష్ణలంక(విజయవాడతూర్పు): ద్విచక్ర వాహనాన్ని కంటైనర్ లారీ ఢీకొన్న ఘటనలో ఓ మహిళ మృతి చెందగా మరో ఇద్దరు గాయపడ్డారు. ఈ ప్రమాదం కృష్ణలంక పోలీస స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల కథనం మేరకు.. పశ్చిమ గోదావరి జిల్లాలోని వట్లూరు గ్రామానికి చెందిన కుంచె అరుణ(35), గణపతిరావు భార్యాభర్తలు. వారికి ఇద్దరు కుమారులు ఉన్నారు. దీపావళి పండుగ నేపథ్యంలో అరుణ తన చిన్న కుమారుడు శ్యాంబాబుతో కలిసి గుంటూరు జిల్లా నంబూరులోని తన పుట్టింటికి ఆదివారం ఉదయం బస్సులో బయలుదేరింది. మధ్యాహ్నం 3.30 గంటలకు వారధి బస్టాప్ వద్ద బస్సు దిగి నంబూరు వెళ్లేందుకు బస్సు కోసం ఎదురు చూస్తుండగా ఆమెకు పరిచయమున్న నూతక్కి గ్రామానికి చెందిన తుమ్మపూడి రవి ద్విచక్ర వాహనంపై వారధి మీదుగా తన గ్రామానికి వెళ్తూ ఆమెను గమనించాడు. ఇక్కడ ఎందుకు ఉన్నారని అతను ఆమెను ఆరా తీశాడు. తమను నంబూరురు తీసుకెళ్లాల్సిందిగా అరుణ కోరింది. రవి వారిని తన ద్విచక్ర వాహనంపై ఎక్కించుకుని బయలుదేరగా వారధి చెక్ పోస్టు వద్ద గుంటూరు వైపు వెళ్తున్న కంటైనర్ లారీ బలంగా ఢీకొట్టింది. దీంతో ముగ్గురు కిందపడిపోయారు. అరుణ తల మీదుగా లారీ వెళ్లడంతో ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. రవి, శ్యాంబాబు గాయపడ్డారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. రవి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

చేతిరాతను మార్చుకుని తలరాతలు దిద్దండి

గుంటూరు ఎడ్యుకేషన్: ఉపాధ్యాయులు తమ చేతిరాతను మెరుగుపరచుకుని విద్యార్థుల తలరాతను మార్చాలని ప్రభుత్వ పాఠ్య పుస్తక విభాగం డైరెక్టర్ కె.రవీంద్రనాథ్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం స్తంభాలగరువులోని చేబ్రోలు మహాలక్ష్మి–పుల్లయ్య నగరపాలకసంస్థ ఉన్నత పాఠశాలలో వివిధ ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న 30మంది ఉపాధ్యాయులకు చేతిరాత నైపుణ్యంలో శిక్షణ తరగతులు నిర్వహించారు. రవీంద్రనాథ్‌రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దుతున్న ఉపాధ్యాయులు క్యాలిగ్రఫీ ఫ్యామిలీగా ఏర్పడి, చేతిరాతను అందంగా మార్చుకోవడంలో తోటి ఉపాధ్యాయులకు ఉచితంగా శిక్షణ తరగతులు నిర్వహించడం అభినందనీయమన్నారు. జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత ఉప్పాల రామమోహనరావుతో కూడిన వివిధ ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయ బృందం ప్రతి వారం సెలవు దినాల్లో తమ సొంత ఖర్చుతో ఈ విధంగా పాఠశాలలకు వెళ్లి, తోటి ఉపాధ్యాయులకు క్యాలీగ్రఫీలో ఉచితంగా శిక్షణ కల్పించడం ద్వారా వందలాది మంది ఉపాధ్యాయులను, తద్వారా వేలాది మంది విద్యార్థుల చేతిరాతను తీర్చిదిద్దుతున్నారని అన్నారు. ఉప్పాల మాట్లాడుతూ చేతిరాత సక్రమంగా లేని వారు చదువుతో పాటు ఇతర ఏ విషయాలపై ఏకాగ్రత చూపలేరని, చేతిరాతను అందంగా మలచుకోవడం ద్వారా ఆత్మ విశ్వాసం, ఏకాగ్రత కుదురుతాయని అన్నారు. చేతిరాత శిక్షణా కార్యక్రమాన్ని తోటి ఉపాధ్యాయ మిత్రుల సహకారంతో ఒక ఉద్యమంలా నిర్వహిస్తున్నామని చెప్పారు. సోమవారం జరిగిన శిక్షణ కార్యక్రమంలో ప్రతిభ చూపిన ఉపాధ్యాయులు శ్రీనివాసరెడ్డి, వందనం, జ్యోతికి జ్ఞాపికలు బహుకరించారు. రిసోర్స్ పర్సన్లు పాల్గొన్నారు.